




సంక్రాంతి స్పెషల్

బీర్‌పూర్‌లో పిండి వంటలు చేస్తున్న మహిళలు

అప్పాలు.. ఘుమఘుమలు

సంక్రాంతి వచ్చేసింది.. గాదె నిండా ధాన్యం, చేతి నిండా ధనంతో అన్నదాతల కుటుంబాల్లో సంతోషం నింపే పండుగ. ప్రత్యేక పిండి వంటలతో ప్రతీ ఇల్లు ఘుమఘుమలాడుతోంది. సకినాలు, గారెలు, అరిసెలు, చేగోడీలు, కారపూస వంటివి తయారు చేసుకోవడంతో వారం, పది రోజుల ముందునుంచే పండుగ వాతావరణం నెలకొంది. ఇరుగుపొరుగు మహిళలు అప్పాలు చేయడంలో ఒకరికొకరు సహకరించుకుంటున్నారు. కుశల ప్రశ్నలు, మాటాముచ్చట్లతోపాటే పిండివంటల తయారు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా తెలుగిళ్లలో చేసే అప్పాలు నోరూరించడమే కాదు.. ఆరోగ్యానికి దోహదం చేసే మంచి పోషక విలువలను కలిగి ఉంటాయి. పండుగ నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవులు రావడంతో విద్యార్థులు ఇళ్లవద్ద ఆటపాటలతో సందడి చేస్తున్నారు. ఆడబిడ్డలు తమ పట్టింటికి చేరుకుంటున్నారు. పల్లెలన్నీ సంక్రాంతి శోభ సంతరించుకున్నాయి.



పిండివంటలు తూకం వేస్తున్న కమలమ్మ

ఆర్డర్‌పై గూడూరు వంటకాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలంలోని గూడూరు పిండి వంటలకు ప్రసిద్ధిగాంచింది. ఇక్కడి మహిళలు ఇళ్లలోనే రుచికరమైన సకినాలు, గారెలు, మురుకులు, బూందీ లడ్డూ, కారపూస, అరిసెలు, భక్షాలు తయారు చేసి, దేశ విదేశాలకు ఆర్డర్‌పై పంపిస్తున్నారు. సంక్రాంతికి 10 రోజుల ముందే హైదరాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి ప్రాంత ప్రజలు ఆర్డర్‌పై తయారు చేయించుకుంటారు. గూడూరులో 5 కుటుంబాలకు చెందిన మహిళలు పిండి వంటల తయారీ ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారు. ఏడాది పొడువునా వీరికి అప్పాల గిరాకీ ఉంటుంది. ఇంగ్లండ్, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దుబాయ్, మస్కట్, బహ్రెయిన్ తదితర దేశాలకు పంపిస్తుంటారు.

బీర్‌పూర్ నుంచి విదేశాలకు..

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ పిండి వంటలకు దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. గ్రామానికి చెందిన గోనె ప్రదీప్‌రావు, సుహాసిని దంపతులు హైదరాబాద్‌లోని తిలక్‌నగర్‌లో 18 ఏళ్ల క్రితం శ్రీలక్ష్మి తెలంగాణ పిండి వంటల పేరిట వ్యాపారం ప్రారంభించారు. దాదాపు 40 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ.. ప్రజలకు అందుబాటు ధరల్లో దొడ్డు అటుకుల చుడువ, పతుల అటుకుల చుడువ, మక్క చుడువ, గారెలు, మురుకులు, చేగోడీలు, బూంది, సన్నసేవ, తెల్ల సకినాలు, కారం సకినాలు, లడ్డూలు, మైసూర్‌పాక్, మరతపేణి, అరిసెలు, కొబ్బరి, చెక్కెర కరియలు, నువ్వులు, బెల్లం కరియలు, భక్షాలు, సున్నుండలు వంటివి విక్రయిస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, దుబాయ్, సింగపూర్, మలేషియా వంటి దేశాలకు కొరియర్ ద్వారా పంపిస్తున్నారు.

నాణ్యతకు ప్రాధాన్యం



మా శ్రీలక్ష్మి తెలంగాణ పిండి వంటల వ్యాపారం ప్రారంభించి, 18 ఏళ్లయింది. అప్పాల తయారీలో నాణ్యతే మాకు ప్రాధాన్యం. శుచి, శుభ్రత పాటించడంతో మాపై ప్రజల్లో నమ్మకం పెరిగింది.

– ప్రదీప్‌రావు, సుహాసిని, నిర్వాహకులు

మిగతా 10లో▸

స్ఫూర్తి ప్రదాత.. వివేకానంద

- స్వామి మాటలకు కట్టుబడి, సేవా కార్యక్రమాల్లో పలువురు
- నేడు జాతీయ యువజన దినోత్సవం



లేవండి.. మేల్కొనండి.. లక్ష్యాన్ని చేరేవరకు విశ్రమించకండి, పడిపోవడం కాదు.. లేచి నిలబడలేక పోవడమే ఓటమి.. ఇవి వివేకానందుని మాటలు. వాటి స్ఫూర్తితో యువత ముందుకుసాగాలి. 1984లో కేంద్ర ప్రభుత్వం తొలిసారి స్వామి వివేకానంద జయంతి రోజు(జనవరి 12)ను జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది. అప్పటినుంచి దేశవ్యాప్తంగా ఏటా జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటున్నాం. స్వామి వివేకానందుని జీవన విధానం, ఆలోచనల ద్వారా యువతను చైతన్యం చేస్తూ దేశానికి మంచి భవిష్యత్తును అందించడమే ఈ వేడుకల లక్ష్యం. వివేకానందుని స్ఫూర్తితో పలువురు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



సాయిరాం సేకరించిన పుస్తకాలు

వివేకానందుని పుస్తకాల సేకరణ



సాయిరాం

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని గోపాల్‌నగర్‌కు చెందిన కొత్వాల సాయిరాం వృత్తిరీత్యా క్షురకుడు. ఇతని మదినిండా స్వామి వివేకానందుని జ్ఞాపకాలే. కులవృత్తితో జీవనోపాధి పొందుతున్న సాయిరాం.. సనాతన ధర్మాన్ని ప్రపంచానికి చాటిన వివేకానందున్ని నిత్యం స్మరిస్తుంటాడు. ఆయన పుస్తకాలు సేకరిస్తున్నాడు. హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం, వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ అకాడమీ ప్రచురించే పుస్తకాలకు చందాదారుగా చేరాడు. ఇల్లు, దుకాణాన్ని స్వామిజీ ఫొటోలతో అలంకరించాడు. ఇప్పటివరకు 400 పుస్తకాలు సేకరించాడు. అతన్ని కదిలిస్తే.. వివేకానందుని బోధనలను వల్లె వేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నేటి యువతరానికి స్వామి వివేకానందుని జీవితాన్ని తెలియజేయాలన్న తలంపుతో పుస్తక సేకరణ చేపడుతున్నట్లు సాయిరాం తెలిపాడు.

మిగతా 10లో▸

న్యూస్‌రీల్

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



వేములవాడ: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. జిల్లాలోని 8 మండలాలకు నూతన అధ్యక్షులను శనివారం నియమించిన సందర్భంగా మాట్లాడారు. వేములవాడ టౌన్ అధ్యక్షుడిగా రాపెల్లి శ్రీధర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా నాగుల మల్లేశంగౌడ్, వేములవాడ రూరల్ అధ్యక్షుడిగా బూర్గుపల్లి పరమేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా జక్కుల తిరుపతి, వేములవాడఅర్బన్ అధ్యక్షుడిగా బుర్ర శేఖర్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా చిట్టిపల్లి వెంకటేశ్వర్‌రావు, కోనరావుపేట మండల అధ్యక్షుడిగా మిర్యాలకార్ బాలాజీ, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా గొట్టేరు రామచంద్రం, చందుర్తి మండల అధ్యక్షుడిగా మొకిల్ విజయేందర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా పోంశెట్టి రాకేశ్, కథలాపూర్ మండల అధ్యక్షుడిగా మల్యాల మారుతి, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కె.మహేశ్‌లను నియమించారు. కుమ్మరి శంకర్, రేగుల మల్లికార్జున్, బండ మల్లేశం, కిష్టస్వామి పాల్గొన్నారు.

సందల్ ఊరేగింపు



గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ముస్తఫానగర్‌లోని మీరా శేఖాద్రిదర్గాలో శనివారం ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా దర్గా పూజారి అబ్దుల్ రహీం ఇంటి నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రార్థనలు చేశారు. దర్గా మూతవల్లి అబ్దుల్ రహీం, మహ్మద్ ఆసిఫ్, మహ్మద్ ఆరిఫ్, మహ్మద్ లతీఫ్, అబ్దుల్ వహీద్, అబ్దుల్ లతీఫ్, మహ్మద్ ఖలీముద్దీన్, షేక్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కాల్చివేత



గంజాయిని కాల్చివేయిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, జిల్లా పోలీసులు

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసులు వివిధ సందర్భాల్లో పట్టుకున్న 26.437 కేజీల గంజాయిని శనివారం డిస్ట్రిక్ట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కాల్చివేశారు. మానకొండూర్ మండలం ఈదులగట్టపల్లిలోని వెంకటరమణ ఇన్సినేటర్స్ కామన్ బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీలో కాల్చినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ వెల్లడించారు. ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న అతి పెద్ద సమస్య గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు యువత బానిసలుగా మారి తమ అమూల్యమైన భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను పోలీసులు సమర్థంగా నిరోధిస్తున్నారని, గంజాయి రహిత జిల్లాగా సిరిసిల్లను చేయడం ధ్యేయమన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఆర్‌ఐ రమేశ్ పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట(సిరిసిల్ల): వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మోటార్ వాహనాల తనిఖీ అధికారి వంశీధర్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా ఆటోడ్రైవర్లు, వాహనదారులు, స్కూల్‌బస్సుల డ్రైవర్లతో శనివారం ఇల్లంతకుంట బస్టాండ్ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడపవద్దని, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని సూచించారు. వాహనాలకు బీమా చేయించుకోవాలన్నారు. కానిస్టేబుల్ ప్రశాంత్, హోమ్‌గార్డ్ ఎల్లయ్య, ఇల్లంతకుంట ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్, రవి, సాయిలు, ఆర్టీసీ కంట్రోలర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాలో ఇద్దరి రిమాండ్

- డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణ పరిధి పెద్దూర్‌లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని సిరిసిల్ల పట్టణ పోలీసులకు అందిన ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదుచేసి రిమాండ్ తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. సలేంద్రి బాలరాజు, గంగుల బాలయ్య ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు ప్రజావాణిలో ఫిర్యాదులు అందాయి. దర్యాప్తు చేసిన పోలీసులు వారిని శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరికి సహకరించిన ఇతర వ్యక్తులపై, ఉద్యోగులపై చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

రాజకీయాలకతీతంగా కలిసి పనిచేద్దాం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- జిల్లాకు నవోదయ పాఠశాల మంజూరుకు కృషి
- ప్రసాద్ పథకంలో వేములవాడ ఆలయ అభివృద్ధికి నిధులు
- సిరిసిల్లలో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: ప్రజల అభ్యున్నతి, సంక్షేమం కోసం రాజకీయాలకతీతంగా కలిసి పనిచేద్దామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం చేపట్టిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. రూ.69.54లక్షల విలువైన 674 పరికరాలను 322 మంది దివ్యాంగులకు అలింకో సంస్థ ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. వేములవాడలో గతంలో రూ.2.50కోట్లతో 1,930 మంది దివ్యాంగులకు పరికరాలు అందించినట్లు గుర్తుచేశారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, ఆ తర్వాత అందరం ప్రజల కోసం నిజాయితీగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాకు నవోదయ పాఠశాల మంజూరుకు కేంద్ర మంత్రిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. ప్రసాద్‌స్కీంలో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లాలో దివ్యాంగులకు ఉపాధి కల్పనకు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇంకా దివ్యాంగులు మిగిలి ఉంటే మరోసారి క్యాంప్ పెట్టి అందజేస్తామని హామీ ఇచ్చారు.

వేములవాడ ప్రాంత అభివృద్ధికి సీఎస్‌ఆర్ నిధులు : ఆది శ్రీనివాస్

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 9వేల మందికిపైగా దివ్యాంగులకు పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. వేములవాడ ఆలయ అభివృద్ధికి ఈ ఏడాదిలో రూ.75కోట్లు, పట్టణంలో రోడ్డు విస్తరణకు రూ.47 కోట్లు మంజూరైనట్లు వివరించారు. వేములవాడ ప్రాంతంలోని పాఠశాలలను సీఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్‌లు శాలువాతో సన్మానించారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాము, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సిరిసిల్ల, వేములవాడ ఏఎంసీ చైర్మన్లు వెల్ముల స్వరూప, రొండి రాజు, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రావు, బండ మల్లేశం యాదవ్, కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాశ్, ఫిరోజ్‌పాషా, గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

పెద్దాలింగాపూర్‌లో పీహెచ్‌సీ ప్రారంభం

ఇల్లంతకుంట(సిరిసిల్ల): మండలంలోని పెద్దలింగాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర సహాయశాఖమంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఆస్పత్రిని ఎఫ్ఎఫ్‌సీ నిధులు రూ.1.56కోట్లతో నిర్మించారు. జిల్లా వైద్యాధికారి రజిత, డాక్టర్ శరణ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్య, నాయకులు పసుల వెంకటి, పాశం రాజేందర్‌రెడ్డి, స్వప్న, వెంకటరమణారెడ్డి, అంతగిరి వినయ్‌కుమార్, అమ్ముల అశోక్ పాల్గొన్నారు.

సమస్యలపై వినతులు

సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్ కెనాల్ ద్వారా నీటిని ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లోని బోయదామకుంటలోకి మళ్లించాలని గ్రామస్తులు విన్నవించారు. పెద్దలింగాపూర్‌లో బ్యాంక్ ఏర్పాటు చేయాలని, గ్రామం నుంచి బాలుమణిపల్లి రైల్వేస్టేషన్ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

ఎస్ఎస్‌ఏ ఆర్డర్లు ఇప్పించాలి

సిరిసిల్లటౌన్: సర్వ శిక్షా అభియాన్‌కు సంబంధించి వస్త్రోత్పత్తి ఆర్డర్లు స్థానిక పవర్‌లూమ్ కుటీర పరిశ్రమల యజమానులకు అందించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరారు. పట్టణంలో 80 శాతానికి పైగా ఉన్నటువంటి చిన్న పవర్‌లూమ్ యజమానులకు గత పదేళ్లుగా ఏ ప్రభుత్వం లబ్ధి చేకూర్చలేదన్నారు. కుటీర పవర్‌లూమ్ వస్త్రోత్పత్తిదారుల సంక్షేమ సంఘం కన్వీనర్ గౌడ వాసు, కోకన్వీనర్ కొండ ప్రతాప్ తదితరులు ఉన్నారు.



కమనీయం.. కూడారై ఉత్సవం

సిరిసిల్లటౌన్: శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం కూడారై ఉత్సవం కమనీయంగా జరిగింది. వందలాది సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గోదాదేవి మొక్కును చెల్లించేందుకు ప్రతీ ధనుర్మాసంలో 108 గంగాళాల పాయసాన్ని నైవేద్యం సమర్పించగా.. అదే పరంపరను కొనసాగిస్తున్నారు. ఆలయ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, తీగల శేఖర్‌గౌడ్, ఈవో మారుతిరావు, ఏఈవో రవీందర్, అర్చకులు కృష్ణమాచారి, వేణుగోపాలాచారి, వర్ధనాచారి తదితరులు పాల్గొన్నారు.



ఓబన్న స్ఫూర్తితో..

సిరిసిల్ల: తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చిరస్మరణీయుడని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ శనివారం నిర్వహించిన వడ్డే ఓబన్న 218వ జయంతిలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఓబన్న స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి రాజమనోహర్, జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డీపీఆర్వో శ్రీధర్, వడ్డెర నాయకులు పాల్గొన్నారు.

ఇంటి బాటలో..




విద్యాసంస్థలకు శనివారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో చిన్నారులు ఇంటిబాట పట్టారు. సిరిసిల్ల బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా మారింది. సమయానికి బస్సులు రాక చాలా సేపు వేచి చూశారు. బస్సులు రాగానే సీటు కోసం ఎగబడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల



ఆఖరు అంకానికి పురపాలన

- ఈనెల 26తో ముగియనున్న మున్సిపల్ కౌన్సిలర్ల పదవీకాలం
- ప్రత్యేకాధికారుల నియామకానికి ప్రభుత్వ ఏర్పాట్లు
- మళ్లీ ఎన్నికల బరిలో దిగేందుకు కౌన్సిలర్ల సన్నద్ధం
- జిల్లాలో మారిన రాజకీయ సమీకరణలు



సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్ భవనం

సిరిసిల్ల: మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఆఖరు అంకానికి చేరింది. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పాలకవర్గాలు 2020 జనవరి 27న కొలువుదీరాయి. ఈనెల 26వ తేదీ నాటికి పదవీకాలం ముగియనుంది. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలకు ప్రత్యేకాధికారులను నియమించి పాలన సాగించాలని భావిస్తోంది. ఈమేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ఇప్పటికే సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. మరోవైపు 2020 నాటి మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానంల్లో అప్పటి టీఆర్ఎస్, ఇప్పటి బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోనూ బీఆర్ఎస్ ఆధిక్యం చాటుకుంది. పురపాలక సంఘాల ఐదేళ్ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో జిల్లాలో తాజా రాజకీయ పరిణామాలపై కథనం.

మళ్లీ పోటీకి కౌన్సిలర్లు సిద్ధం

సిరిసిల్ల పట్టణంలో 39 వార్డులు, వేములవాడలో 28 వార్డులు ఉన్నాయి. రెండు పట్టణాల్లోనూ కౌన్సిలర్లుగా ఐదేళ్లుగా పనిచేస్తున్న అభ్యర్థులు మళ్లీ పోటీకి సిద్ధమవుతున్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగిన మరోసారి పోటీలో నిలిచి సత్తాచాటుకోవాలని భావిస్తున్నారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో అనుచరులతో సన్నాహాలు చేస్తున్నారు. 2020 ఎన్నికల్లో సిరిసిల్లలో 22 స్థానాలు, వేములవాడలో 16 స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. కానీ తాజా రాజకీయ పరిణామాలతో కొందరు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. మారిన రాజకీయ సమీకరణలతో మున్సిపల్ ఎన్నికలు ఈసారి రసవత్తరంగా సాగనున్నాయి. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది ప్రభుత్వం ప్రకటించకపోగా.. ప్రత్యేకాధికారులను నియమించాలని భావిస్తోంది.

2020 నాటి మున్సిపల్ ఎన్నికల పరిస్థితి

సిరిసిల్ల మున్సిపల్‌లో నలుగురు అభ్యర్థులు కల్లూరి రాజు, అన్నారం శ్రీనివాస్, దార్ల కీర్తన, దార్నం అరుణ ఏకగ్రీవం కాగా.. వేములవాడలో నీలం కల్యాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిరిసిల్లలో 35 వార్డుల్లో, వేములవాడలో 27 వార్డుల్లో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో అధికార బీఆర్ఎస్ టిక్కెట్లు ఆశించి భంగపడిన వారు ఇండిపెండెంట్లుగా పోటీచేసి సత్తాచాటుకున్నారు. సిరిసిల్లలో 12 మంది స్వతంత్రులు విజయం సాధించగా.. ఇందులో 9 మంది బీఆర్ఎస్ రెబల్స్ కావడం విశేషం. వేములవాడలో ఐదుగురు ఇండిపెండెంట్స్ గెలువగా.. ఇందులో నలుగురు అభ్యర్థులు బీఆర్ఎస్ తిరుగుబాటు అభ్యర్థులు కావడం అప్పట్లో రాజకీయంగా చర్చనీయాంశమైంది. సిరిసిల్ల, వేములవాడల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులు మున్సిపల్ చైర్‌పర్సన్లుగా, వైస్‌చైర్మన్లుగా కొలువుదీరారు.

విలీనబంధంపై వీడని చిక్కుముడి

సిరిసిల్లలో విలీనమైన ఏడు గ్రామాలను విడదీసి మళ్లీ గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించింది. వేములవాడలోనూ ఐదు గ్రామాలు విలీనమయ్యాయి. వీటిని మళ్లీ గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలో ఆయా గ్రామాల వివరాలు సేకరించిన ప్రభుత్వం పంచాయతీల ఏర్పాటుపై నిర్ణయాన్ని ప్రకటించలేదు. మున్సిపల్ ఎన్నికల కంటే ముందే.. గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో విలీన బంధంపై ఏదో ఒక్క నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నారు. మరోవైపు 2020 నుంచి 2025 వరకు ఐదేళ్ల పదవీకాలంలో కరోనా లాక్‌డౌన్ వంటి పరిస్థితులు, 2023 శాసనసభ ఎన్నికలు, 2024 పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఆశించిన మేరకు అభివృద్ధి పనులు జరగలేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఏది ఏమైనా జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో మరో పక్షం రోజుల్లో పుర'పాలన' ముగియనుంది. ప్రత్యేకాధికారుల పాలన రానుంది.

క్లుప్తంగా

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చొక్కాల రాము


చొక్కాల రాము

సిరిసిల్లటౌన్: జిల్లా ముదిరాజ్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా చొక్కాల రాము విజయం సాధించారు. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో 203 మంది ఓటర్లకు 195 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీపడగా చొక్కాల రాముకు 91, కోల నర్సయ్యకు 77, యామ తిరుపతికి 27 ఓట్లు వచ్చాయి. 14 ఓట్ల ఆధిక్యంతో చొక్కాల రాము విజయం సాధించారు. కాగా కార్యవర్గంలోని మిగతా పదవులు ఏకగ్రీవమయ్యాయి. నూతనంగా ఎన్నికైన చొక్కాల రాముకు అభినందనలు వెల్లువెత్తాయి.

గుజరాత్ హిందీ సమ్మేళన్‌లో 'కందేపి'



సిరిసిల్లటౌన్: 'విశ్వ హిందీ దివస్' సందర్భంగా గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్ పాల్గొన్నారు. నేషనల్ బుక్ ట్రస్టు ఆఫ్ ఇండియా నుంచి ఎన్నో హిందీ పుస్తకాలను ఆమె తెలుగులోకి అనువదించారు. కవులు డాక్టర్ కమలేశ్ జైన్ వసంత్, సుశ్రీసోనల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంకు ప్రారంభం



ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రంలో పెట్రోల్‌బంక్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి కనమేని చక్రధర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్‌చైర్మన్ వెల్మల రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు నర్సయ్య, యాదగిరి, నాయకులు బండి శ్రీకాంత్, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీను, దీటి నర్సింలు, నరేశ్, బాలసాని శ్రీను, శ్రీధర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు.

గ్రాండ్‌గా ఫేర్‌వెల్



ఎల్లారెడ్డిపేట: విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శనివారం ఫేర్‌వెల్‌పార్టీ ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సద్ది లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేర బేగం, వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ నేవూరి వెంకటనరసింహారెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ నయీమా పాల్గొన్నారు.

అప్పాలు.. ఘుమఘుమలు

- సంక్రాంతి నేపథ్యంలో ఇళ్లలో పిండి వంటల తయారీ
- పండుగ శోభ సంతరించుకున్న పల్లెలు


సిరిసిల్లలో సకినాలు చేస్తున్న మహిళ

సిరిసిల్ల కల్చరల్: పిండివంటలు రుచికరం.. ఆరోగ్యకరం. గారెలు, సకినాలు, అరిసెలు, చేగోడీలు, నువ్వుల ఉండలు తదితరాల తయారీకి బియ్యం, శనగ పిండి, వాము, బెల్లం, నువ్వులు తదితర పదార్థాలను ఉపయోగిస్తారు. సంక్రాంతి నేపథ్యంలో అందరి ఇళ్ల నుంచి పిండివంటల ఘుమఘుమలు వస్తున్నాయి. అప్పాలు సీజనల్‌గా వచ్చే అనారోగ్య సమస్యలను దూరం చేస్తాయి. బియ్యం, శనగ పిండి శరీరానికి కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లను సమకూరుస్తాయి. చలికాలంలో నువ్వులు శరీర ఉష్ణోగ్రతను పెంచుతాయి. బెల్లం రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు కావాల్సిన ఐరన్‌ను అందిస్తుంది. ఇక, వాము సీజన్‌లో వచ్చే దగ్గు, జలుబు వంటి వాటిని నియంత్రించేందుకు ఉపయోగపడుతుంది. నువ్వుల్లో ఉండే నూనె సంబంధిత పదార్థాలు చర్మాన్ని పొడిబారకుండా చూస్తాయి. ఎదిగే పిల్లల్లో రక్తహీనతను నివారిస్తాయి. ఏ, డీ, ఈ, కే విటమిన్లు లభిస్తాయి. గారెల్లో వాడే మినుములు, పల్లీలు మంచి ప్రొటీన్లను అందిస్తాయి. రాజన్నసిరిసిల్ల జిల్లాలో మహిళలు అప్పాల తయారీలో నిమగ్నమయ్యారు.

మా అవ్వ దగ్గర నేర్చుకున్న..


ఇట్టిరెడ్డి భూమవ్వ, గుడిపేట

మల్యాల(చొప్పదండి): నేను సకినాలు పోసుడు చిన్నప్పుడే మా అవ్వ దగ్గర నేర్చుకున్న. 60 ఏండ్ల సంది సకినాలు పోత్తున్న. అప్పట్లో పండుగ అయినంక రెండు నెలలపాటు ఏ ఊరికిపోయినా సకినాలే సద్దిమూట కట్టుకొని, పోయేటోళ్లం. మా పొలంలో పండిన దొడ్డు వడ్లను గిరిండ్ల పట్టిచ్చుకచ్చి, రాత్రి పూట బియ్యం నానవోసేటోళ్లం. మబ్బుల లేసి, రోట్లో పిండి రుబ్బి, సకినాల తయారు చేసేటోళ్లం. ఇరుగుపొరుగువాళ్లు వచ్చి, మాకు సకినాలు పోత్తె.. మేం వాళ్లకు పోసి, కాల్చేది. సకినాలు, గారెలు చేసుకునేటోళ్లం.

మంథని నుంచి విదేశాలకు..


ప్యాక్ చేసిన పిండివంటలు చూపుతున్న బండారి సునీత

మంథని: మంథనికి చెందిన పలువురు మహిళలు స్వయం ఉపాధి కోసం పిండి వంటలు తయారు చేస్తున్నారు. కారపు సకినాలు, అరిసెలు, గారెలు, మురుకులు, నూలపల్లి ముద్దలు, మోతిచూర లడ్డూలను హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాలతోపాటు అమెరికా, లండన్, సింగపూర్, ఆస్ట్రేలియా దేశాలకు పంపిస్తున్నారు. శుభకార్యాలు, పండుగల సందర్భంగా అప్పాల విక్రయాలు ఎక్కువగా జరుగుతాయని, ఏ రకమైన పిండివంటలైనా కిలో రూ.300 నుంచి రూ.400కు విక్రయిస్తున్నట్లు వాణి లక్ష్మీనారాయణ స్వగృహ ఫుడ్స్ నిర్వాహకురాలు బండారి సునీత తెలిపింది.

ఆర్డర్‌పై అప్పాల తయారీ


పిండి వంటలు చేస్తున్న మహిళ

జ్యోతినగర్(రామగుండం): మారుతున్న ప్రజల జీవనశైలి కారణంగా రామగుండం నగరంలో పిండి వంటలు తయారు చేసి, విక్రయించేవారి సంఖ్య పెరుగుతోంది. పలువురు ఇళ్లలో అప్పాలు చేయడం కంటే బయట కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రామగుండం కార్పొరేషన్ మల్కాపూర్‌కు చెందిన ఉత్తూరి రమేశ్–గంగారాణి దంపతులు తమ గ్రామంలో పండి వంటలు తయారు చేస్తూ పలువురు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. అరిసెలు, లడ్డూలు, సకినాలు, కారపూస, గారెలు తదితర వంటకాలకు ఆర్డర్లు వస్తున్నాయని తెలిపారు.

పండుగల సమయాల్లో గిరాకీ



పండుగల సమయాల్లో పిండివంటలకు గిరాకీ ఉంటుంది. చాలా మంది అరిసెలు, సకినాలు, లడ్డూలు, గారెలు తయారు చేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. రుచికరంగా, నాణ్యతతో అప్పాలు చేసి, ఇస్తుండటంతో మాకు అనేక ఆర్డర్లు వస్తున్నాయి. మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్నాం.

– నిరంజన, కృష్ణానగర్, ఎన్టీపీసీ, రామగుండం

క్యాన్సర్‌తో ఆటోకార్మికుని మృతి

- నారాయణపూర్‌లో విషాదం
- రోడ్డున పడ్డ భార్య, కుమారుడు


పర్శరాములు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ చింతాల పర్శరాములుగౌడ్ (36) క్యాన్సర్ వ్యాధితో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు లక్షల్లో అప్పులు చేసి వైద్యం చేయించినా ప్రాణం దక్కలేదు. నారాయణపూర్‌కు చెందిన పర్శరాములు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆరేళ్ల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చూపించగా.. క్యాన్సర్ వ్యాధి సోకినట్లు వైద్యులు తెలిపారు. కడు పేదరికం అనుభవిస్తున్న కుటుంబమైనప్పటికీ కొడుకును దక్కించుకునేందుకు తండ్రి చింతాల నారాయణగౌడ్ అప్పులు చేసి వైద్యం అందించారు. నెల రోజుల క్రితం పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ క్యాన్సర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. పర్శరాములుగౌడ్ మృతితో భార్య లావణ్య, ఐదేళ్ల కుమారుడు రోడ్డున పడ్డారు.

నృసింహుని సన్నిధిలో లోకాయుక్త చైర్మన్ పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శనివారం తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త చైర్మన్ జస్టిస్ వెంకటరాములు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు దేవస్థానం పక్షాన పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

నకిలీ సర్టిఫికెట్‌తో పదోన్నతి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన రాజన్న ఆలయ ఈవో
- అరెస్టుకు రంగం సిద్ధం

వేములవాడ: రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగి పదోన్నతి కోసం ఏకంగా నకిలీ సర్టిఫికెట్లు సమర్పించడం కలకలం రేపుతుంది. ఆలయంలో పనిచేసిన ఏఈవో హరికిషన్ ప్రమోషన్ కోసం నకిలీ సర్టిఫికెట్ సమర్పించారని ఆలయ పర్యవేక్షకులు బి.తిరుపతిరావు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు హరికిషన్ సర్టిఫికెట్లపై ఆరా తీయగా నకిలీగా తేలాయి. 2014లో లలిత్ నారాయణ్ మిథిల యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్లు పొందినట్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీనిపై హైకోర్టును సైతం ఆశ్రయించగా.. తప్పు రుజువు కావడంతో క్రిమినల్ కేసు నమోదుచేయాలని హైకోర్టు సూచించింది. అంతేకాకుండా ప్రమోషన్‌పై లబ్ధిపొందిన వాటిని రికవరీ చేయాలని సూచించింది. పదోన్నతి కల్పించిన అప్పటి ఈవోపై చర్యలు తీసుకోవాలని నివేదికలో కోరింది. చర్యలు తీసుకోవాలని ఆలయ ఈవోకు రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఈనెల 10న ఉత్తర్వులు పంపించారు. ఆమేరకు ఈవో వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం బయటకు తెలియడంతో సదరు అధికారి పరారీలో ఉన్నట్లు తెలిసింది.

పోలీసుల పేరిట డబ్బులు వసూలు

- ఒకరి రిమాండ్

సిరిసిల్లక్రైం: పీడీఎస్ రైస్ కేసు విషయంలో పోలీసులతో మధ్యవర్తిత్వం చేసి కేసు నమోదుకాకుండా చూస్తానని డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపైని రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన గడీల ఉఫ్ తాడూరి సురేష్ అనే వ్యక్తి సిరిసిల్ల టౌన్ పోలీసుల పేరు చెప్పి సిరిసిల్లలోని ఆటోనగర్‌కు చెందిన అనంతుల శ్రీనివాస్‌కు రేషన్‌బియ్యం కేసులో స్టేషన్ బెయిల్ ఇప్పిస్తానని నమ్మించి సురేష్ రూ.20వేలు వసూలు చేశాడు. బెయిల్ ఇప్పించకపోవడంతో సదరు వ్యక్తి నిలదీశాడు. మరో రూ.20వేలు ఇవ్వకపోవడంతోనే జైలుకు వెళ్లినట్లు తెలపడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సురేష్‌ను రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఏడుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఏడుగురిపై ఎల్లారెడ్డిపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి, రాగట్లపల్లి శివారులో శనివారం సాయంత్రం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని ఎస్సై రమాకాంత్ హెచ్చరించారు. ధ్రువీకరణపత్రాలు లేని 11 వాహనాలకు జరిమానా విధించారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

హై బీపీతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


రాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌కు చెందిన పులి రాజు(36) అనే ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ హైబీపీతో మెదడులో నరాలు చిట్లి శనివారం రాత్రి మృతి చెందాడు. దీంతో స్వగ్రామంలో విషాదం అలుముకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతేడాది రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సమయంలో తలకు బలమైన గాయాలయ్యాయి. అప్పటి నుంచి హైబీపీతో ఇబ్బంది పడుతున్నాడు. వారం క్రితం అస్వస్థతకు గురైన రాజును కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మరణించాడు. రాజు భార్య లత గతంలో ఎంపీటీసీగా పనిచేశారు. మృతునికి భార్య లతతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజు ఆకస్మిక మృతిపై మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

సిరిసిల్లలో ప్రభుత్వ వ్యతిరేక వాల్‌పోస్టర్లు

సిరిసిల్లక్రైం: ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేలా వాల్‌పోస్టర్లు అతికిస్తున్న ముగ్గురిని సిరిసిల్లటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారిని విచారించగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి కొత్తబస్టాండ్ వరకు వాల్‌పోస్టర్లు అతికించేందుకు తమను మాట్లాడుకున్నట్లు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు తమకు పని అప్పగించారని తెలపడంతో, సదరు నాయకుడిని విచారించేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం. వారు ఇచ్చిన సమాచారంతో బీఆర్‌ఎస్ జిల్లా స్థాయి నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

చిన్నారిపై వృద్ధుడి లైంగికదాడి

కోనరావుపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఐదేళ్ల వయస్సు గల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగికదాడికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. చిన్నారి అస్వస్థతకు గురికాగా తల్లిదండ్రులు సిరిసిల్లలోని పిల్లల వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు పిల్లల వైద్యుడు, మహిళా వైద్యురాలి వద్దకు పరీక్షల నిమిత్తం పంపించారు. పరీక్షించిన వైద్యురాలు చిన్నారిపై లైంగికదాడి జరిగినట్లు తెలపడంతో తల్లిదండ్రులు వెంటనే కోనరావుపేట పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పరామర్శ


ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ సోదరుడి కుమారుడు రాజు ముంబైలో జరిగిన ప్రమాదంలో చనిపోయాడు. వారి కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గుండా థామస్ మాదిగ శనివారం పరామర్శించారు. రాజుకు భార్య ఉష, కుమారుడు గణేశ్, కూతురు గాయత్రి ఉన్నారు. పరామర్శించిన వారిలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అందె చంద్రయ్య, అందె బాబు, రమేశ్, సత్తయ్య, సౌందర్య ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



తంగళ్లపల్లి(సిరిసిల్ల): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఒకరిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తంగళ్లపల్లి ఎస్సై రామ్మోహన్ తెలిపారు. అంకిరెడ్డిపల్లె శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆటోతోపాటు మరో వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. రెండు వాహనాలు, వాటిలో ఉన్న 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేసి ఠాణాకు తరలించినట్లు తెలిపారు. రేషన్‌బియ్యం దందా చేస్తున్న దుబ్బాకకు చెందిన విభూతి రాజేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. పెట్రోలింగ్‌లో కానిస్టేబుల్ నరేందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

టీజీవో క్యాలెండర్ ఆవిష్కరణ



సిరిసిల్ల: తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం(టీజీవో) 2025 క్యాలెండర్‌ను మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఆవిష్కరించారు. టీజీవో డైరీని అసోసియేషన్ అధ్యక్షుడు సమరసేన, కార్యదర్శి జబీ ఉల్లా, ఉపాధ్యక్షులు జానకీ, సంయుక్త కార్యదర్శి సాయికిరణ్ అందించారు. టీజీవో కార్యవర్గ సభ్యులు శేఖర్, భాస్కర్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


బాలవ్వ(ఫైల్)

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రంలోని బోయవాడకు చెందిన పంపరి బాలవ్వ (110) శనివారం మృతిచెందింది. ఆమెకు కుమారుడు, కూతురు, ముని మనుమండ్లు ఉన్నారు. కుమారుడు పదేళ్ల క్రితమే గుండెపోటుతో మరణించగా మనుమండ్లు పంపరి అర్జున్, శోభన్ ఆమె ఆలనాపాలనా చూశారు.

స్ఫూర్తి ప్రదాత.. వివేకానంద

రామగుండం యువమిత్ర సేవా సమితి


ఢిల్లీలో యువజన వేడుకల్లో శంకర్ (ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని సంజయ్‌నగర్‌కు చెందిన ఈదునూరి శంకర్ స్వామి వివేకానందుని స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. రక్తదానం చేయకుండా ఎవరూ తనువు చాలించకూడదన్న నినాదంతో 2001లో రామగుండం యువమిత్ర సేవా సమితి అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాడు. ప్రభుత్వ పథకాలు, రక్తదానం, యోగా, మొక్కలు నాటడం, యూత్ ఎంప్లాయ్‌మెంట్ సెమినార్లు, చదువు ఆవశ్యకత, పుస్తక పఠనం, గ్రంథాలయాల అభివృద్ధి, కవి సమ్మేళనాలు, నీటి సంరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాడు. అంబేడ్కర్ భారత్ భూషణ్, నేషనల్ ఎక్స్‌లెన్సీ, రాష్ట్ర యువకీర్తి, దళితరత్న, జాతీయ సమైక్యత, జాతీయ యువజన సంప్రదాయ అవార్డులు అందుకున్నాడు. యువత సమాజ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించాలని, ప్రభుత్వాలు దేశాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలని శంకర్ కోరుతున్నాడు.

నెలకు రూ.వంద.. ఆపదలో అండ


పేద కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న యువ బలగం సభ్యులు (ఫైల్)

రామగిరి(మంథని): ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో విధులు నిర్వహించే సింగరేణి కార్మికులు 30 మంది సింగరేణి యువ బలగం పేరిట ఒక బృందంగా ఏర్పడ్డారు. ప్రతీ నెల రూ.100 జమ చేస్తూ సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. సెంటినరికాలనీ రాణీ రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు, నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం, ఫ్యామిలీ డే తదితర కార్యక్రమాలను కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సభ్యులు


విద్యార్థులకు బహుమతి ఇస్తున్న యూత్ సభ్యులు (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మర్తనపేటకు చెందిన 23 మంది యువకులు 2021లో హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. కంటిచూపు సమస్యలతో ఇబ్బంది పడుతున్న గ్రామానికి చెందిన 100 మంది వృద్ధులను గుర్తించి, వైద్య పరీక్షలు చేయించారు. వారిలో 15 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు జరిపించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థికసాయం, నిరుపేద యువతుల వివాహానికి సామగ్రి అందిస్తున్నారు. నిరుపేదలకు అండగా నిలుస్తున్నామని సంఘం అధ్యక్షుడు బోనాల రాజేశ్ తెలిపాడు.

రక్తదాన శిబిరాలు.. లక్ష మొక్కలు


గాంధీ శాంతి బహుమతి అందుకుంటున్న యాదవరాజు (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): మహాత్మాగాంధీ, స్వామి వివేకానందుని స్ఫూర్తితో 35 ఏళ్లుగా సమాజ సేవ చేస్తున్నారు గోదావరిఖనికి చెందిన కన్నెబోయిన యాదవ రాజు. నేషనల్ యూత్ ప్రాజెక్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడిగా ఉన్నారు. దేశవ్యాప్తంగా పర్యటిస్తూ యువతకు వ్యక్తిత్వ వికాస, యోగా శిబిరాలు నిర్వహిస్తున్నారు. వరదలు, కరోనా సమయాల్లో 18 వేల మందికి పైగా సేవలందించారు. లక్ష వరకు మొక్కలు నాటారు. 125 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, 65 సార్లు రక్తదానం చేశానని తెలిపారు. హరియాణా మాజీ సీఎం భూపేందర్‌సింగ్ చేతులమీదుగా గాంధీ శాంతి బహుమతి అందుకున్నారు. తెలంగాణ సంస్కృతి.. సంప్రదాయాలను దేశ నలుమూలలా చాటిచెబుతున్నట్లు పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతో క్రమశిక్షణ..

బోయినపల్లి (చొప్పదండి): యువత ఆధ్యాత్మికత వైపు వెళ్తే క్రమశిక్షణ అలవడుతుంది. మంచి ఆలోచనలు వస్తాయి. ఇది సహనాన్ని అలవరుస్తుంది. ప్రపంచాన్ని చేతిలో ఉంచుకునే అగ్రరాజ్యమైన అమెరికాను తన మాటల తూటాలతో మంత్రముగ్ధులను చేసిన స్వామి వివేకానందుడు.. రామకృష్ణ పరమహంసను గురువుగా ఎంచుకున్నారు. ప్రపంచం గుర్తించే జ్ఞానయోధుడిగా ఎదిగారు.

లక్ష్య సాధనపై గురి పెట్టాలి..

లక్ష్యం లేని జీవనం కొనసాగించడం అర్థరహితం. యువత సమాజంలో గుర్తింపు పొందాలంటే ప్రత్యేకమైన స్థానంలో ఉండాలి. ఆ స్థానం పొందాలంటే లక్ష్యం నిర్దేశించుకోవాలి. దాని సాధనపై గురిపెట్టాలి. కఠోర శ్రమతో విజయాన్ని చేరుకోవాలి.

యువతతో ఏదైనా సాధ్యమే

విద్యానగర్(కరీంనగర్): ప్రపంచ దేశాల్లో చూస్తే యువత ఎక్కువగా ఉన్నది మన దేశంలోనేనని పలువురు పేర్కొన్నారు. వారు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని, వివేకానందుని ఆదర్శవంతమైన జీవన విధానం ఇందుకు ప్రేరణగా నిలుస్తుందన్నారు.

యువతరానిదే బాధ్యత..



దేశ భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉంది. వారు లేకుండా దేశ పురోగతి అసాధ్యం. అభివృద్ధి బాధ్యత యువతరానిదే. చురుకైన భాగస్వామ్యం అవసరం.

– తొడుపునూరి సౌమ్య, విద్యార్థిని, జ్యోతినగర్, కరీంనగర్

సవాళ్లతో సతమతం



మన దేశంలో యువత సవాళ్లతో సతమతమవుతోంది. విద్యావ్యవస్థ సాంకేతికతను అనుసరించడంలో వెనకబడింది. విద్యార్థులు సరైన నైపుణ్యాలు పొందలేక పోతున్నారు.

– ఎ.కిరణ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత, కరీంనగర్

రాజకీయాల్లోకి రావాలి



యువత రాజకీయాల్లోకి రావాలి. అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది. ప్రపంచ దేశాల్లో ప్రత్యేకతను చాటుకుంటుంది.

– కోట శ్యాంకుమార్, సామాజిక కార్యకర్త, విద్యానగర్, కరీంనగర్

నిరుద్యోగం ప్రధాన సమస్య



యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నిరుద్యోగం. కష్టపడి చదివినా ప్రతిభకు తగిన ఉద్యోగాలు పొందలేక లేకపోతున్నారు. ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– వొడ్నాల మధు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, తీగలగుట్టపల్లి, కరీంనగర్



రాజన్నకు వీకెండ్ తాకిడి



వేములవాడ: రాజన్నను శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ గోపురాలను ఫైర్ సిబ్బంది శుభ్రం చేశారు. ప్రాకారాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేసి గోపురాలను శుభ్రం చేశారు. భీమేశ్వరస్వామి ఆలయంలోని శనీశ్వరుడికి తైలాభిషేకం చేశారు.

కొండగట్టులో ప్రముఖుల పూజలు


ఆలయం ముందు కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి ప్రతిమ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్నను శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ప్రతిమ, రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, లోకాయుక్త జస్టిస్ చింతపల్లి వెంకటరాములు వేర్వేరు సమయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు. అధికారులు శాలువాలతో సత్కరించారు.